క్లుప్తంగా

మంత్రి జూపల్లి పరామర్శ

కొల్లాపూర్: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన కొండూరు బాలకృష్ణ(48) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, ప్రజాసంఘాల నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

ఇంటి నిర్మాణానికి తోడ్పాటు



కల్వకుర్తి రూరల్: పట్టణానికి చెందిన రాజు ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సిమెంట్ బస్తాలను సోమవారం అందించారు. నియోజకవర్గంలో పేదల ఇళ్ల నిర్మాణానికి చేయూతనిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, గణేష్, షకీల్, సైదులు, రాజు పాల్గొన్నారు.

నేడు చిరుధాన్యాల సాగుపై అవగాహన

బల్మూర్: మండలంలోని పోలిశెట్టిపల్లి, తుమ్మెన్‌పేట రైతు వేదికలలో రైతులకు చిరుధాన్యాల సాగుపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఓ నరేష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. చిరు ధాన్యాలు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. సదస్సుకు రైతులు సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



తెలకపల్లి: మండల కేంద్రంలో బాలికల గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఏఆర్ లక్ష్మికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వేణుకుమార్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో వాష్‌రూం, మరుగుదొడ్లు గురుకులాలలో దారుణంగా ఉన్నాయన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది లేక అపరిశుభ్రత నెలకొందని వివరించారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నరేష్, జిల్లా నాయకులు చిరంజీవి, రాజు, మధుసూదనచారి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు కోసం స్థల పరిశీలన



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని కుమ్మరి గుట్టలో సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులు, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహులు మార్కెట్ యార్డు కోసం స్థల పరిశీలన చేశారు. యార్డు నిర్మాణం కోసం ఐదు ఎకరాల భూమి అవసరం ఉందని మార్కెట్ చైర్మన్ దండు నర్సింహ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శివకుమార్, సర్వేయర్ బాబునాయక్, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాజు, వెంకటస్వామి, మల్లేష్, రాములు పాల్గొన్నారు.

తాగునీరు వృథా..

వెల్దండ: మండలం ఉబ్బలగట్టుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రావిచెట్టుబావితండాలో సింగిల్ ఫేజ్ బోరు మోటార్ ఆన్‌చేసి వదిలేయడంతో నీరు వృథాగా వెళ్తోంది. ప్రజలకు తాగునీరు ఇబ్బందులు లేకుండా అధికారులు తండాలో సింగిల్‌ఫేజ్ బోరువేసి మోటార్ బిగించారు. బోరు స్టాటర్‌కు తాళం లేకపోవడంతో కొందరు బోరువేసి అలాగే వదిలేస్తున్నారు. దీంతో తాగునీరు వృథా అవుతోందని తండావాసులు వాపోతున్నారు. నీరు వృథా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వర్షం కోసం ఎదురుచూపులు

- వాడిపోతున్న మొక్కలు
- దిగాలు చెందుతున్న రైతన్నలు



అంతారం శివారులో పంటల్లో గుంటుకలు కొడుతున్న రైతులు

తాడూరు: మండలంలోని ముందస్తుగా తొలకరి వర్షాలు రావడంతో రైతులు వ్యవసాయ పొలాలను సాగుచేసుకొని పంటలు వేశారు. వానాకాలంలో పత్తి, మొక్కజొన్న, కంది, ఆముదం వంటి విత్తనాలను వేశారు. జూన్ నెలలో ఒక్కసారి కూడా భారీ వర్షం కురవలేదు. చిరుజల్లులు మాత్రం పలకరించి పోతున్నాయి. ఇప్పటివరకు వర్షం జాడ లేకపోవడంతో రైతన్నలు దిగాలు చెందుతున్నారు. పంటలు వాడుముఖం పట్టడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కొందరు రైతులు స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందించి పంటలను కాపాడుకుంటున్నారు. వర్షం కోసం రైతులు ఆకాశంవైపు చూస్తున్నారు. మరి కొన్ని చోట్ల వర్షం కోసం ఎదురుచుస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం భూమిలో తేమ ఆవిరై విత్తనాలు మొలకెత్తే పరిస్థితి లేదు.

వర్షం అంతంతే ...

మండలంలో జూన్ నెల నాటికి సాధారణ వర్షపాతం 109.4 మిల్లీమీటర్లు నమోదుకావల్సి ఉండగా 76.1 మిల్లీ మీటరు వర్షంపాతం నమోదైంది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 38.1 మిల్లీమీటర్లు తక్కువగా కురిసింది. నియోజకవర్గంలోని 5 మండలాల్లో వర్షపాతం చాలా తక్కువగా నమోదయ్యిందని అధికారులు తెలిపారు.

స్ప్రింక్లర్ల ద్వారా పంటలకు నీరు

భూమిలో తేమ లేక విత్తనాలు మొలకెత్తకపోవడం, మొలకెత్తినవి వాడిపోతుండడంతో పంటలకు నీరు అందించే పనులు ప్రారంభించారు. మొక్కజొన్న, పత్తి వంటి పంటలకు స్ప్రింక్లర్లు, ఆరుతడి పంటలకు బోరుబావుల ద్వారా నీరు అందిస్తున్నారు. కొంత మంది రైతులు ఇంకా విత్తనాలు వేయాల్సి ఉంది. మిగతా రైతులు వర్షాల కోసం వేచి చూస్తున్నారు. మరికొంత మంది రైతులు బోరు బావుల ద్వారా నీటిని అందించడంతోపాటు పంట పొలాల్లో కలుపు తీయడంతోపాటు గుంటుకులు తోలడంలో నిమగ్నమయ్యారు.



స్ప్రింక్లర్ల ద్వారా నీరు అందిస్తున్న రైతులు

సరిపడ వర్షం కురవలేదు



20 రోజులకు పైగా పంటలకు సరిపడ వర్షం కురవలేదు. వర్షం వస్తుందనే ఆశతో నాలుగు ఎకరాలలో పత్తి సాగు చేశారు. కొంత మేర విత్తనాలు మొలకెత్తాయి. మొలకెత్తని విత్తన స్థానంలో కొత్తగా విత్తుకున్నాం. వర్షాలు రాకపోతే పంటలు ఎండిపోయి నష్టాలపాలవుతాం.

బాలస్వామి, రైతు, పర్వతాయపల్లి

స్ప్రింక్లర్లు ఏర్పాటు చేశాం



మూడు ఎకరాల్లో పత్తి విత్తనాలు సాగు చేశారు. గతంతో కురిసిన వర్షానికి విత్తనాలు మొలకెత్తి ఎదిగాయి. కొన్ని రోజుల నుంచి వర్షాలు రాకపోవడంతో స్ప్రింక్లర్ల ద్వారా మొలకలు వాడిపోకుండా నీటిని అందిస్తున్నాం. అక్కడక్కడ నిలిచిన గడ్డిని తొలగించేందుకు గుంటుకలు ఏర్పాటు చేస్తున్నాం. వర్షం కోసం ఎదురు చూస్తున్నాం.

– యాదయ్య, రైతు, అంతారం

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



వటువర్లపల్లి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులు ప్రారంభిస్తున్న హౌసింగ్ ఏఈ వెంకటేష్

ఊర్కొండ: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. మండలంలోని మాదారంలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ హౌజింగ్ తరుణ్, ఎంపీఓ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు స్థానిక నాయకులు, లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి నియోజకర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘువేందర్, నాయకులు రవూఫ్, దేవస్వామి, రమాకాంత్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వటువర్లపల్లిలో ..

దోమలపెంట: వటువర్లపల్లిలో 12 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా సోమవారం ఇళ్ల నిర్మాణాల కోసం ముగ్గుపోసి నిర్మాణ పనులు చేపట్టారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేష్, మాజీ సర్పంచ్ ఛత్రూనాయక్, పంచాయతీ సెక్రెటరీ రాంబాబు, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్నాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కషాయాలతో చీడపీడల నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

లింగాల: పంటలలో వివిధ పత్రాలతో తయారు చేసిన కషాయాల వాడకంతో పంటలకు సోకే చీడపీడలను నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి జి. అనిల్ అన్నారు. మండలంలోని మగ్దూంపూర్‌లో ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే వివిధ కషాయాల తయారు విధానంపై సోమవారం ఆర్టీటీ, మండల వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతులకు అవగాహన కల్పించారు. డెమోలో భాగంగా దశపత్రిలో వాడే వివిధ రకాల పత్రాలను ఉపయోగించి కషాయాలను తయారు చేసుకోవాలని ఏఓ రైతులకు వివరించారు. వేప, సీతాఫలం, వావిల, ఉమ్మెత్త, వయ్యారిభామ, జిల్లెడు పత్రాలు, 20 లీటర్ల గోమూత్రం, రెండు కిలోల వెల్లుల్లి, రెండు కిలోల పచ్చిమిర్చి, అరకిలో పసుపు అన్నింటిని డ్రమ్ములో వేసి 200 లీటర్ల నీటిని పోసి 45 రోజుల పాటు ప్రతి రోజు ఉదయం , సాయంత్రం కలియతిప్పాలని పేర్కొన్నారు. దశపత్రి కషాయం తయారు అయిన తర్వాత 20 లీటర్ల పంపులో అర లీటరు కషాయాన్ని కలిపి పంటలపై పిచికారి చేసుకోవాలన్నారు. ఇలాంటి విధానానికి రైతులు అలవాటు పడితే పంటలను చీడపీడల నుంచి రక్షించుకోవచ్చని ఏఓ రైతులకు వివరించారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, ఏఈఓలు భరత్‌కుమార్, సురేందర్‌రెడ్డి, రైతులు శ్రీనునాయక్, సోమ్లా, రవి తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడులను అరికట్టాలి

కందనూలు: రాష్ట్రంలో మీడియాపై జరుగుతున్న దాడులను అరికట్టాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (హెచ్143), తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. మీడియాపై దాడికి పాల్పడిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్, జాతీయ నాయకుడు జెమిని సురేష్, జిల్లా కార్యదర్శి రాజేష్‌గౌడ్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు ఖానాపురం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: మీడియా సంస్థలపై దాడి తగదని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మధుగౌడు అన్నారు. జిల్లా కేంద్రంలోని రూబీగార్డెన్‌లో సోమవారం డివిజన్ అధ్యక్షుడు సందు యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన టీయూడబ్ల్యూజే(ఐజేయూ) డివిజన్ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లో ఓ చానల్ కార్యాలయంపై జరిగిన దాడి చేడిని ఆయన ఖండించారు. జర్నలిస్టు స్వేచ్ఛ మృతికి మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, ఎం రాములు, కంచర్ల శ్యాంసుందర్, విజయ్ కుమార్, కందికొండ మోహన్, పి.వెంకటస్వామి, మాధవరెడ్డి, కిషోర్, పంగిడి వెంకటస్వామి, జర్నలిస్టులు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

వీఆర్ఏల అరెస్టు



వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వీఆర్ఏలను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సోమవారం హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ వద్ద శాంతియుత ధర్నాకు రాష్ట్ర కమిటీ పిలుపు ఇవ్వడంతో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం సాయంత్రం సొంతపుచీకత్తుతో వీఆర్ఏలను పోలీసులు విడుదల చేశారు. కార్యక్రమంలో శరత్,రాజు, కృష్ణయ్య, బాల్‌రాం తదితరులు ఉన్నారు.

మొహర్రం సందడి

తిమ్మాజిపేట: మండల కేంద్రంతో పాటు ఆవంచ, నేరళ్లపల్లి, మారేపల్లి, గొరిట, బావాజిపల్లి, పోతిరెడ్డిపల్లి, అప్పాజిపల్లి, కోడుపర్తి గ్రామాల్లో పీర్లను ప్రతిష్ఠించారు. పీర్ల చావిడీ ఎదుట అలయ్ బలయ్ ఆడారు.



కేజీబీవీలో దరఖాస్తుల ఆహ్వానం

చారకొండ: మండల కేంద్రంలో కేజీబీవీలో నైట్ వాచ్‌మెన్‌గా పని చేసేందుకు మహిళ అభ్యర్థుల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ఝాన్సీరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన మహిళ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. జూలై4 న సాయంత్ర 5 గంటల వరకు మండల కేంద్రంలో ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆదివారం ఆస్పత్రిలో చికిత్సపొందుతూ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలోని పుల్జాలకు చెందిన ఈశ్వర్ (28)కు తెల్కపల్లి మండలం రామిరెడ్డిపల్లికి చెందిన యువతితో ఈనెల 14న ప్రేమ వివాహం జరిగింది. అమ్మాయిని తల్లిదండ్రులు పుల్జాలకు వచ్చి తీసుకువెళ్లగా.. ఈశ్వర్ మనస్తాపానికి గురై ఈనెల 20న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి చంద్రయ్య సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నదిలో వేటకు వెళ్లొద్దు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిలలో ఉన్న కృష్ణానది బ్యాక్ వాటర్ ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద ప్రవాహం పెరిగిందని మత్స్యకారులు కూడా నదిలో వేటకు వెళ్లొద్దని ఎస్ఐ హృషికేష్ కోరారు. సోమవారం గమనించిన రెవెన్యూ, పోలీసు అధికారులు పుష్కర ఘాట్ల వద్దకు చేరుకొని పర్యాటకులను అప్రమత్తం చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ బోట్ల యాజమానులు జాగ్రత్తలు పాటించాలన్నారు. పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు, పర్యాటకులు, నదిలో స్నానలు ఆచరించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోసుకోవాలని కోరారు. ఘాట్ల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



తాడూరు: వచ్చే నెల కల్వకుర్తిలో నిర్వహించే సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భరత్ అన్నారు. సోమవారం మండలంలోని అకునెల్లికుదు, ఎంగంపల్లి గ్రామాల్లో గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలతో దళితులు, మహిళ, మైనార్టీలకు ప్రమాదం ఏర్పడిందన్నారు. నాయకులు నర్సింహ, చంద్రయ్య, ఇందిరమ్మ, మహేశ్వరమ్మ, ఉషన్న తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనం పాటిస్తే చర్యలు



ప్రతిజ్ఞ చేస్తున్న కాంసానిపల్లి గ్రామస్తులు

ఉప్పునుంతల: గ్రామాల్లో అంటరానితనం పాటించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ బాల్‌రాం నాయక్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని కాంసానిపల్లిలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలోని దళితులను ఆలయ ప్రవేశం చేయించారు. గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కులమత భేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి జీవించాలని సూచించారు. హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి పాటించొద్దని కోరారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని అదిరాలలో అంటరానితనంపై సోమవారం హనుమాన్ దేవాలయం ఎదుట డీటీ రమేష్‌నాయక్ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులను దేవాలయాల ప్రవేశాలను అడ్డుకోవద్దు, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి పాటించొద్దన్నారు. కులవివక్ష పాటించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఖలీల్, ఆర్ఐ శివకృష్ణ, గ్రామ కార్యదర్శి సంధ్య, రామస్వామి, మల్లేష్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, పెద్ద సింగోటి, దేవేందర్, చెన్నయ్య, కాశన్న, రాజు పాల్గొన్నారు.

తాగునీటి కోసం బీఆర్ఎస్ నాయకుల ధర్నా



పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కాలనీవాసులు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని 3, 4, 5 వార్డులలో వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు కాలనీ వాసులతో కలిసి ధర్నా చేశారు. తాగునీటి సమస్యపై స్పందించక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. దీంతో కార్యదర్శి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో డబ్బులు లేవని తనవంతుగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ సర్పంచ్ గోపిగౌడ్, కోఆప్షన్ సభ్యులు రజాక్, నాయకులు స్వామి, వెంకటేష్, ప్రశాంత్, సైఫ్, సలావుద్దీన్, నాగయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయించొద్దు



తిమ్మాజిపేటలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ కమల్‌కుమార్

తిమ్మాజిపేట: విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయించొద్దని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రాన్ని సోమవారం ఏఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణం యజమానులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎమ్మార్పీ ధరలకే క్రిమి సంహారక మందులు విక్రయించాలన్నారు. ఎరువులు, పిచికారి చేసేందుకు తీసుకున్న మందులకు విధిగా రసీదులు ఇవ్వాలన్నారు. దుకాణంలోని స్టాక్ వివరాలకు సంబంధించిన ధరలను బోర్డుపై రాసి పెట్టాలన్నారు. పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేద్దాం

కల్వకుర్తి రూరల్: నాగర్‌కర్నూల్‌లో ఈ నెల 8న నిర్వహించే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు అన్నారు. సోమవారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో సంఘం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా కన్వీనర్ గోలి సుదర్శన్ రెడ్డి, కో కన్వీనర్ రాములు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యాంసుందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల అభివృద్ధి



వెల్దండ: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు చొక్కన్నపల్లి గ్రామాలకు విద్యుత్ స్తంభాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లుగా విద్యుత్ స్తంభాలు, వైర్ల సమస్య ఉన్నప్పటికి పట్టించుకోలేదని ఎమ్మెల్యే చొరవ తీసుకొని నూతన ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు స్తంభాల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎర్రశ్రీనుముదిరాజ్, నాయకులు సాయిరెడ్డి, రషీద్, తిరుపతిరెడ్డి, కిష్టాల్, శ్రీను, జంగయ్య, సుమంత్ తదితరులు ఉన్నారు.

మత్స్యకారులకు నగదు బదిలీ చేయాలి

వీపనగండ్ల: మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి చేపపిల్లలకు బదులుగా డబ్బులను మత్స్యకారుల ఖాతాలో జమ చేయాలని గోవర్ధనగిరి గ్రామ మత్స్య సహకార సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన మత్స్య సహకార సంఘ సమావేశంలో పాల్గొన్న జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు బాలయ్య మాట్లాడుతూ చేపపిల్లలను వదిలేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నామని చెప్పున్నా సంబంధిత కాంట్రాక్టర్ నాసిరకం చేపపిల్లలను మత్స్యకారులకు అంటగడుతున్నారని ఆరోపించారు.

రోడ్డుపై నిలిచిన మురుగు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో మురుగుకాల్వలు లేకపోవడంతో వర్షపు నీటితో పాటు మురుగు నీరు రోడ్లపై నిలిచింది. మురుగు కాల్వల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. దోమలకు ఆవాసాలుగా ఏర్పర్చుకున్నాయి. చినుకు పడిందంటే సీసీరోడ్లు సైతం బురద మయంగా మారి నడిచేందుకు వీలులేకుండా ఉందని స్థానికులు వాపోతున్నారు. మండలంలోని చర్ల ఇటిక్యాలలో పాఠశాలకు వెళ్లే దారిలో సీసీ రోడ్డు వేశారు కాని డ్రెయినేజీ కాల్వలు నిర్మించకపోవడంతో రోడ్డుపైనే మురుగు పారుతోంది. దుర్వాసన భరించలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి మురుగు కాల్వల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.



రోడ్డుపై నిలిచిన మురుగు

నిధులు మంజూరు

కందనూలు: నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని దేవాలయ పునర్‌నిర్మాణానికి రూ.1.61 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని దేవాలయాలకు దూప, దీప, నైవేద్యం కోసం నిధుల మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



అచ్చంపేట/లింగాల/బల్మూరు/చారకొండ: అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జన్మదిన వేడుకలను సోమవారం లింగాల మండలంలోని అంబట్‌పల్లి, బల్మూరు మండలంలోని జనకుంట కనకాల మైసమ్మ ఆలయం ఎదుట, చారకొండలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అచ్చంపేటలోని జినుకుంట మైసమ్మ ఆలయం వద్ద పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు.

దళితవాడల్లో సమస్యలు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణంలోని దళితవాడల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాగిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, శివరాం, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.